క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని ఎంపీడీవో ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నామన్నారు. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి సరైన ఆధారాలు లేకుంటే వాటిని రద్దు చేస్తామన్నారు. మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండడం ద్వారా గ్రామాల్లోని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, హౌసింగ్ ఏఈ నాయుడు, ఈవోఆర్డీ సోమరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సాదిరెడ్డి' కుటుంబానికి కంబాల పరామర్శ



రమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జోగులు

నక్కపల్లి: ఇటీవల అనారోగ్యంతో మరణించిన రేబాక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సాదిరెడ్డి రమణ కుటుంబీకులను ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం పరామర్శించారు. రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌గా పని చేస్తున్న రమణ కుమారుడు సాదిరెడ్డి శ్రీనును ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గొర్ల గోవిందరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పాడగట్ల పాపారావు, చందనాడ సర్పంచ్ తళ్ల భార్గవ్, పార్టీ నాయకుడు మనబాల తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పశు వైద్యాధికారే దిక్కు..!



మునగపాక ప్రభుత్వ పశు వైద్యశాల

మునగపాక: మండల కేంద్రమైన మునగపాక ప్రభుత్వ పశు వైద్యశాల ట్రైనీ ఉద్యోగి ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ఇక్కడ పశు వైద్యాధికారిగా పనిచేసిన లావేటి ప్రదీప్‌కుమార్ నెలన్నర రోజుల క్రితం సెలవుపై వెళ్లారు. నాటి నుంచి నాగులాపల్లి పశువైద్యాధికారి మౌనికకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె వారంలో రెండు రోజుల పాటు వస్తూ సేవలందిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో వైద్య సేవలందక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ట్రైనీ ఉద్యోగి ఒకరు సేవలందిస్తున్నారు. వర్షాకాలంలో పశువులకు అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఇటువంటి సమయంలో పశువైద్యాధికారి పూర్తి స్థాయిలో ఉందుబాటులో లేకుంటే ఎలా అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. మండల ప్రధాన కేంద్రమైన మునగపాక పశువైద్యశాలకు పూర్తిస్థాయి వైద్యం అందించే వైద్యుని నియామకంపై పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరికీ దైవభక్తి అవసరం



గొల్లలపాలెంలో వినాయకుడిని దర్శించుకుంటున్న ప్రసాద్


మునగపాక: ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొల్లలపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆయన సోమవారం దర్శించుకుని, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంచి పని తలపెట్టే ముందు వినాయకున్ని పూజించడం ఆనవాయితీ అని చెప్పారు. దీనిలో భాగంగా ప్రసాద్ తన వంతుగా రూ.10వేల విలువ చేసే ఢమరుకం కమిటీ సభ్యులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శీరా రమణమ్మ, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కృష్ణ, దొడ్డి బుజ్జి, బర్ల వెంకునాయుడు, శీరా అప్పారావు, మురుకుర్తి రమణ, యల్లబిల్లి కొండబాబు పాల్గొన్నారు.

ప్రకృతి కన్నెర్ర చేసింది. పాలకుల కరుణ కరువైంది. వరుణుడు పత్తా లేకుండా పోయాడు. వర్షాలు లేక, పంటలు పండక 1993 నుంచి 2004 మధ్య కాలంలో కరువు రక్కసి కబంధ హస్తాల్లో అన్నదాతలు చిక్కుకుపోయారు. అలాంటి తరుణంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశాకిరణంగా కనిపించారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయి అన్నదాత దిక్కులు చూస్తున్న సమయంలో ఆయన అపర భగీరథుడిగా నిలిచారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 25 వేల ఎకరాలకు సాగునీరు అందించి ఆంధ్రా కాటన్‌గా పేరొందారు.

అన్నదాతల గుండెల్లో రాజముద్ర



దశాబ్దాల నిరీక్షణకు మోక్షం కలిగించిన అపర భగీరథుడు



దాదాపు పూర్తి కావచ్చిన పోలవరం కాలువ

నక్కపల్లి:

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి పాయకరావుపేట నియోజకవర్గంతో విడదీయ రాని అనుబంధం ఉంది. రాజీవ్ పల్లెబాట ద్వారా నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. ఆ సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. అలా నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోయారు. గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మించి గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన కాటన్ దొర గురించి చరిత్ర ద్వారా తెలుసుకున్నాం. పాఠాల్లో చదువుకున్నాం. ప్రత్యక్షంగా చూశాం కూడా. అటువంటి బృహత్తర కార్యక్రమాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా చేశారు. నియోజకవర్గంలో ప్రధానంగా తాండవ, వరాహ నదులపై మినీబ్యారేజ్‌ల నిర్మాణం ద్వారా దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించి అన్నదాతల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు.

మహానేత హయాంలో అభివృద్ధి పనులు

- పాయకరావుపేటలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు
- ఇంటర్ నుంచి పీజీ విద్యార్థుల కోసం పాయకరావుపేటలో అందుబాటులోకి ప్రభుత్వ హాస్టల్
- తాండవ నదిలో రూ.8 కోట్లతో మినీ బ్యారేజీలు నిర్మించి తాండవ జలాలు వృథాకు అడ్డుకట్ట
- దాదాపు 30 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్న 35 క్యూసెక్కుల తాండవ జలాలను పేట ప్రజలకు అందించారు. ఖరీఫ్, రబీల్లో రెండు పంటలు పండించే రైతులకు సాగునీటి కష్టాలు తీర్చారు.
- బంగారయ్యపేట, ఉపమాక చందనాడ, సీతంపాలెం, చినతీనార్ల, మంగవరం, గునిపూడి, సత్యవరం గ్రామాలకు సుమారు రూ.8 కోట్ల వ్యయంతో తారురోడ్ల నిర్మాణం
- పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని పాయకరావుపేట వరకు తరలించేందుకు రూ.25 కోట్ల కేటాయింపు

ఉద్దండపురం వాటర్ గ్రిడ్‌కు శ్రీకారం

ఉద్దండపురం వద్ద 97 గ్రామాలకు తాగు నీటి ఎద్దడి తీర్చే వాటర్ గ్రిడ్‌కు రూ.36 కోట్లు కేటాయించి, ఏలేరు కాలువ నీటిని తరలించేందుకు అనుమతులు మంజూరు చేసి పైపులైన్లు వేశారు. ఏలేరు నీటిని ఉద్దండపురం వద్ద ప్రత్యేకంగా నిర్మించిన ట్యాంకుల్లో నిల్వ చేశాక శుద్ధి చేసి గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలనేది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ వాటర్ గ్రిడ్‌కు బీజం వేసింది వైఎస్సారే.

నియోజకవర్గంలో పోలవరం పరవళ్లు

ప్రజా ప్రస్థానంలో భాగంగా ఈ ప్రాంతంలో పాదయాత్ర చేసిన వైఎస్‌కు ఈ ప్రాంత రైతులు పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన పోలవరం పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో పోలవరం ఎడమ కాలువ కింద పాయకరావుపేట నియోజకవర్గంలో 6, 7, 8 ప్యాకేజీల కింద వైఎస్సార్ హయాంలోనే పాయకరావుపేట నుంచి యలమంచిలి వరకు కాలువ నిర్మాణ పనులు 50 శాతం పూర్తయ్యాయి. కాలువలో చేరిన వర్షపు నీటితో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో కాలువను ఆనుకుని ఉన్న పొలాల్లో రైతులు ఖరీఫ్‌తో పాటు, రబీలో కూడా వరి పండించి ఫలాలు అనుభవిస్తున్నారు.

చేనేత కార్మికులకు చేయూత



మూతపడిన ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్

వృత్తిని కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న చేనేత కార్మికులకు ఫ్యాషన్ టెక్నాలజీ ఏర్పాటు ద్వారా అండగా నిలిచారు. పాయకరావుపేటలో సుమారు 300 మంది చేనేత కార్మికులకు ఆయన చేయూతనిచ్చారు. పాయకరావుపేట పట్టణంలో చేనేత కార్మికులు ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రత్యామ్నాయంగా రూ.కోటి వ్యయంతో ఫ్యాషన్ టెక్నాలజీ ఏర్పాటు చేశారు. ఫ్యాషన్ టెక్నాలజీ ద్వారా మహిళలు శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి పొందేవారు. మహానేత మరణానంతరం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ ఫ్యాషన్ టెక్నాలజీని నిర్వీర్యం చేయడంతో అది కాస్తా మూతపడింది.

- తాండవ జలాలు వృథా కాకుండా మినీ ఆనకట్టలు
- పాయకరావుపేటలో రూ.8 కోట్లతో నిర్మాణం
- 25 వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఆంధ్రా కాటన్
- నేడు వైఎస్సార్ వర్ధంతి

- నక్కపల్లి మండలంలో జానకయ్యపేటలో పశువుల ఆస్పత్రి, చినదొడ్డిగల్లులో పీహెచ్‌సీ మంజూరు, పాయకరావుపేట మండలం మంగవరంలో పీహెచ్‌సీ మంజూరు
- ఎస్.రాయవరం మండలంలో వరాహ నది గ్రోయిన్లకు రూ.5 కోట్లతో మరమ్మతులు చేపట్టారు.
- నియోజకవర్గంలో 4,700 మంది రైతులకు సుమారు 9 వేల ఎకరాలు ప్రభుత్వ భూముల పంపిణీ
- నియోజకవర్గంలో ఇందిరమ్మ పథకం ద్వారా సుమారు 37 వేల ఇళ్ల నిర్మాణం.

మినీ ఆనకట్టలు వైఎస్ చలువే..



గతంలో తాండవ నీటి కోసం రైతులమంతా కాలువ గట్లపై పడిగాపులు పడేవాళ్లం. ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు వైఎస్‌కు ఈ సమస్య వివరించడంతో వెంటనే ఆయన స్పందించి పాయకరావుపేటలో రూ.8 కోట్లతో మినీ ఆనకట్టలు నిర్మించడంతో పాటు, నియోజకవర్గానికి రావాల్సిన 35 క్యూసెక్కుల నీటిని విడదలకు జీవో ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకు ఖరీఫ్ రబీలలో సాగునీరు పుష్కలంగా అందుతోంది. పేట ప్రజలను వైఎస్సార్ భగీరథుడిలా ఆదుకున్నారు. ఆయనను ఎప్పటికీ మర్చిపోలేం. వరితోపాటు, తమలపాకు, అరటి తదితర ఉద్యాన వన పంటలు సాగు చేస్తున్నాం.

– పెనుమచ్చు నాగేశ్వరరావు, రైతు, మంగవరం

కారణజన్ముడు వైఎస్సార్



దివంగత నేత వైఎస్సార్ కారణజన్ముడు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకే జన్మించి ఆ బృహత్తర కార్యం పూర్తి చేసిన తర్వాత అందని దూరాలకు వెళ్లిపోయారు. మహానేత హయాంలోనే పాయకరావుపేట నియోజకవర్గంలో సాగు, తాగు నీటి కష్టాలు తీరాయి. శాశ్వతమైన అభివృద్ధి పనులు చేపట్టారు. మారుమూల గ్రామాలకు తారు రోడ్డు సదుపాయం లభించింది. రైతుల కోసం పోలవరం కాలువ నిర్మాణం, తాండవ జలాలు విడుదల, విద్యార్థుల కోసం ఐటీఐ, హాస్టల్ వంటి సదుపాయాలు కల్పించారు. అలా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ, ఎప్పటికీ పేదవాడి గుండెల్లో పదిలమే..

– వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు

కబడ్డీ పోటీల విజేత హైటెక్ జట్టు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మునగపాక: ప్రతి ఒక్కరూ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాక నందీశ్వర కళా ప్రాంగణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు ఆదివారం రాత్రి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. చెడు వ్యసనాలకు గురి కాకుండా సమాజానికి మేలు చేసే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉందన్నారు. ప్రో కబడ్డీ వచ్చాక కబడ్డీపై మరింత ఆసక్తి చూపుతున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మాజీ ఎంపీటీసీ టెక్కలి పరశురామ్, నిర్వాహకులు టెక్కలి సురేంద్ర, ఆడారి సూరిబాబు, ఆడారి శ్రీకాంత్, పెంటకోట అప్పలనాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో మునగపాకకు చెందిన హైటెక్ టీమ్, ద్వితీయ స్థానంలో డేంజర్ గాయ్స్ జట్టు, తృతీయ స్థానంలో ప్రగతి స్కూల్ జట్టు నిలిచాయి. ఈ పోటీలకు పెంటకోట శ్రీనివాసరావు, చిన్ని కృష్ణ, వేగి శ్రీను తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కబడ్డీ పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు భారీగా తరలివచ్చారు.


అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధుల నివారణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నక్కపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సువర్ణ సంధ్య తెలిపారు. సోమవారం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వైరల్ జ్వరాలు, అతిసార, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం ఎంతో మేలని చెప్పారు. నిల్వ ఉన్న మాంసం, చేపలు తినరాదన్నారు. దగ్గు, జలుబు, వంటి లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఉన్న పీహెచ్‌సీలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇళ్ల ముందు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా తొలగించుకోవాలన్నారు. కిరాణా దుకాణాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను కొనొద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, ఆంగ్ల ఉపాధ్యాయుడు వై.వి.రమణ పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నేడు విస్తృత సేవలు



విలేకర్లతో మాట్లాడుతున్న కంబాల జోగులు

నక్కపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం అన్ని మండలాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నక్కపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మండల కేంద్రాల్లోను, గ్రామాల్లోను వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. వైఎస్సార్ మరణించినప్పటికీ ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ ప్రతి ఒక్కరి గుండెల్లో పదిలంగా ఉన్నాయన్నారు. పేదలకు ఉపయోగపడేలా ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీటీసీ గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : మండల కేంద్రమైన అచ్యుతాపురం దుప్పితూరు సచివాలయ సమీపంలో ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ నివాళులర్పించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చినుకు పడితే తప్పని పాట్లు



అడ్డురోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీరు



యలమంచిలి నుంచి గాజువాక వెళ్లే దారిలో నిలిచిన నీరు

అచ్యుతాపురం రూరల్: చిన్నపాటి వర్షానికే మండల కేంద్రమైన అచ్యుతాపురం కూడలిలో కాలువలు పొంగి రహదారులపై నీరు నిలిచిపోతోంది. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకూ జరుగుతున్న రహదారి విస్తరణ పనుల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఓ మోస్తరు వర్షం పడితే ఇక అంతే సంగతులు. రహదారులన్నీ పూర్తిగా డ్రైనేజీ నీటితో నిండిపోతున్నాయి. యలమంచిలి నుంచి గాజువాక వెళ్లే దారిలో పూర్తిగా కాలువ నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పాదచారులు అటువైపు రాకపోకలు సాగించడానికి భయపడిపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడ్డురోడ్డులో..

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు జంక్షన్‌లో ఓ మోస్తరు వర్షం కురుస్తే చాలు వరదనీరు పొంగి పొర్లుతోంది. సోమవారం అడ్డురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్డుపై నిలిచిపోయింది. రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ



టీషర్టులు అందుకున్న హాకీ క్రీడాకారులు

యలమంచిలి రూరల్: యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో హాకీ శిక్షణ పొందుతున్న క్రీడాకారుల్లో 18 మందికి విశ్రాంత విద్యుత్ శాఖ అధికారి కోన శంకర్రావు సోమవారం టీషర్టులు అందజేశారు. తన భార్య రమణమ్మ మూడో వర్ధంతి సందర్భంగా ఆయన ఈ టీషర్టులు పంపిణీ చేసినట్టు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొఠారు నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లా రమణ మాస్టారు, తిమ్మాపతిన పాపారావు, ఎల్.సత్యారావు, వై.అప్పారావు, కాళిదాసు, నరసింహమూర్తి, లక్ష్మణరావు, పౌర సేవా సంఘం ప్రతినిధులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



కొరుప్రోలులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సిబ్బంది



పులపర్తి వెంకటసత్యనారాయణ ట్రేడర్స్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి వెంకటసత్యనారాయణ ట్రేడర్స్, లక్కవరం పీఏసీఎస్‌ల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువుల స్టాకు, అమ్మకాల వివరాలు పరిశీలించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. ఎరువుల అమ్మకాలకు సంబంధించి రైతులకు తగు రసీదు ఇస్తున్నారో? లేదో? ఆరా తీశారు. యలమంచిలి మండలంలో 40 మెట్రిక్ టన్నుల ఎరువు అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు తెలిపారు. విజిలెన్స్ అధికారి శంకర్ లాల్ నాయక్, శంకర్ గోవింద్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఎరువులు గొడౌన్స్‌ని సోమవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఏసీఎస్ గొడౌన్‌లో భద్రపరిచిన యూరియా, ఎరువులు సోమవారం పంపిణీ చేస్తుండగా విజిలెన్స్ సిబ్బంది శంకర్ లాల్‌నాయక్, చంద్రశేఖర్ వచ్చారు. నిల్వ ఉన్న యూరియా ఎరువును, రైతులకు అందిస్తున్న తీరుపై విచారణ చేశారు. అనంతరం గుడివాడ గ్రామంలో ప్రైవేటు ఎరువులు దుకాణాన్ని కూడా తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ తనిఖీల్లో వ్యవసాయాధికారి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన



వినాయకుని విగ్రహం వద్ద దీపారాధనలో మహిళలు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరం సచివాలయం వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుని సన్నిధిలో సోమవారం రాత్రి కాలనీకి చెందిన మహిళలు, విద్యార్థినులు చేసిన దీపారాధన ఆకట్టుకుంది. వినాయకుని ఆకారంలో రంగులతో ఆకర్షణీయంగా ముగ్గు వేసి నూనె దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. కమిటీ సభ్యులు గొల్లవిల్లి చిన్నాజీ, జానకి, కొఠారు సూర్యప్రకాష్, నాని, గుర్రాల హరీష్, నూకమణి, కొఠారు రత్నం, రాధిక, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలో అచ్యుతాపురం, దోసూరు, తిమ్మరాజుపేట గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేసి కార్మికులకు రక్షణ కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ నెల 15న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రాజాన అప్పలనాయుడు, రమేష్, రాజు, చిట్టిబాబు, వసంత, పైడిరాజు, కార్మికులు పాల్గొన్నారు.

టీచర్ శ్రీనివాసరావుకు సత్కారం



ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

ఎస్.రాయవరం: తెలుగు మహాసభలు సన్నాహాల్లో భాగంగా ఆదివారం విశాఖపట్నంలో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్న గుర్రాజుపేట ఉపాధ్యాయుడు కాదంబరి శ్రీనివాసరావును ఏపీటీఎఫ్ జిల్లా సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం పాఠశాలలో పని చేస్తూ 2026 జనవరిలో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు ఎంపికైన శ్రీనివాసరావు సేవలు మరువలేనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.